7

సాక్షి అనకాపల్లి

మంగళవారం। 15। ఏప్రిల్। 2025

అంబేడ్కర్‌కు ఘన నివాళి



8లో

డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలి వద్ద గల విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ సత్యవతి అనకాపల్లిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృత్యుంజయురాలు



కిర్రా సునీత

కోటవురట్ల: బాణసంచా ప్రమాదం నుంచి ఓ బాలిక అదృష్టవశాత్తూ తప్పించుకుంది. అనుకోకుండా మరో చిన్నారి ప్రాణాలను కూడా కాపాడింది. కైలాసపట్నానికి చెందిన కిర్రా సునీత నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసింది. శనివారం వెలువడిన ఫలితాలలో 910 మార్కులు కూడా సాధించింది. ప్రస్తుతం సెలవులు కావడంతో వారం రోజులుగా తండ్రి కిర్రా నాగేశ్వరరావుతోపాటు బాణసంచా తయారీ కేంద్రానికి వెళ్లి పనిచేస్తోంది. ఆదివారం నాగేశ్వరరావు ఏదో పని ఉండి డ్యూటీకి వెళ్లకపోవడంతో సునీత ఒక్కతే పనికి వెళ్లింది. పనిచేస్తూ సరిగ్గా పేలుడు సంభవించే రెండు నిమిషాల ముందు మంచినీళ్లు తాగేందుకు పక్కకు వచ్చింది. అదే సమయంలో.. ప్రమాదంలో మృతి చెందిన దేవర నిర్మల రెండేళ్ల కూతురు సునీత వెంట బయటకు వచ్చింది. మంచినీళ్లు తాగుతుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుళ్లు సంభవించగా భయంతో చిన్నారిని చంకన పెట్టుకుని అక్కడి నుంచి దూరంగా పరుగుతీసింది. దీంతో తాను బతకడమే కాకుండా చిన్నారి ప్రాణాలను కూడా కాపాడింది.

క్షతగాత్రులకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా



మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

తుమ్మపాల: కైలాసపట్నం బాణసంచా ప్రమాదంలో మృతులకు ప్రకటించిన రూ.15 లక్షల ఆర్థిక సహాయంతో పాటు క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, వైద్యఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. అనకాపల్లిలో నిర్వహించిన డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ జయంతి వేడుకల అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ముందుగా రూ.5 లక్షలు చెల్లిస్తామన్నారు. వీలైనంత త్వరగా మిగిలిన పరిహారం కూడా అందజేస్తామన్నారు. మృతుల దహన సంస్కార ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా క్షతగాత్రులకు రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందన్నారు. కైలాసపట్నం బాణసంచా తయారీ కేంద్రంలో భారీ స్థాయిలో సరకు ఉందని ప్రాథమిక విచారణలో అధికారులు నిర్ధారించారన్నారు. పూర్తి నివేదిక వచ్చిన తర్వాత చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఊహించని ఉత్పాతం జరిగింది.. ఉపాధి ఉసురు తీసింది.. అవలీలగా బాణసంచా తయారు చేసే వారంతా.. దానికే బలైపోయారు. ఘటన జరిగి 40 గంటలు గడుస్తున్నా.. ఆ శబ్దం ఇంకా చుట్టుపక్కల ప్రాంతాల్ని భయపెడుతూనే ఉంది. బాణసంచాకు ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లాలో అనేక చోట్ల ఈ తరహా కేంద్రాలున్నాయి. కైలాసపట్నం ఘటనతో ఆయా ప్రాంతాలు ఉలిక్కిపడ్డాయి. తమ ప్రాంతంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రాణాలు గుప్పెట పెట్టుకొని జీవిస్తున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే ఉలికిపాటు నటించే జిల్లా అధికార యంత్రాంగం.. ఆ తర్వాత ఏమరుపాటుగా వ్యవహరిస్తుండటంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఓవైపు వరుసగా జరుగుతున్న ఫార్మా ప్రమాదాలు అనకాపల్లి జిల్లాని ఆందోళనకు గురిచేస్తుండగా.. ఇప్పుడు బాణసంచా ప్రమాదం.. మరింత వణికిస్తోంది.



- మందుగుండుకు అనకాపల్లి జిల్లా ప్రసిద్ధి
- రెట్టింపు సంఖ్యలో గుర్తింపులేని యూనిట్లు
- పట్టించుకోని అగ్నిమాపక శాఖ అధికారులు
- జిల్లాలో అధికారికంగా 21 తయారీ కేంద్రాలు
- ఘటన జరిగినప్పుడు ఉలికిపాటు.. ఆ తర్వాత ఏమరపాటు
- ఇప్పటికే ఫార్మా ప్రమాదాలతో ఉక్కిరిబిక్కిరి
- ఇప్పుడు బాణసంచా పేలుడుతో మరింత ఆందోళన
- ఏ సమయానికి ఏం జరుగుతుందేమోనని ఆయా ప్రాంత ప్రజల భయం

క్షణక్షణం.. భయం భయం



కైలాసపట్నంలో ఆదివారం నాటి పేలుళ్లలో తునాతునకలైన బాణసంచా తయారీ కేంద్రం భవనాలు

సాక్షి, విశాఖపట్నం:

మందుగుండు సామగ్రికి **అనకాపల్లి జిల్లా** ఎంతో ప్రసిద్ధి. పెళ్లిళ్లు, అమ్మ**వారి పండగలు, ఇతర** ఉత్సవాలకు బ్రాండెడ్ సంస్థ**లు బాణసంచాను అం**దించలేవు. అందుకే.. లోకల్**గా ఉన్న తయారీ కేం**ద్రాలపై ఆధారపడుతుంటా**రు. ఇక్కడ జనం కోరిన** విధంగా బాణసంచా తయా**రుచేస్తారు. పేల్చిన**ప్పుడు ఏ రంగు రావాలి, ఎ**లాంటి సౌండ్ రావాలి,** ఎలా దూసుకెళ్లాలి.. ఇలాం**టి స్పెషల్ క్రాకర్స్** రూపొందిస్తారు. ఒక దుకాణ**ంలో పనిచెయ్యడం..** అక్కడ ఎలా తయారు చేస్తు**న్నారో అవగాహన పెం**చుకొని.. వేరే చోట తయా**రీ కేంద్రం పెట్టడం..** ఇలా జిల్లాలో ఇబ్బడి ముబ్బ**డిగా పెరిగిపోయాయి.** ఉమ్మడి విశాఖతోపాటు తూ**ర్పు గోదావరి, విజయ**నగరం జిల్లాలోని ప్రాంతాల**వారికీ అనకాపల్లి నుం**చే బాణసంచా సరఫరా చే**స్తారు. జిల్లాలో అనేక** ప్రాంతాల్లో బాణసంచా తయా**రీ కేంద్రాలు పుట్టగొ**డుగుల్లా వెలిశాయి. మొత్తం **40 కేంద్రాలున్నట్టు** అంచనా. కానీ.. ఇందులో లైసెన్సులు తీసుకొని నడుపుతున్నవి మాత్రం 21 మాత్రమే. మిగిలిన 19 **దుకాణాలకు లైసెన్స్ లేదని తెలిసినా.. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కారణం.. నెలనెలా వసూళ్ల వర్షం నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 40 దుకాణాలున్నాయని చెబుతున్నప్పటికీ.. మరో 20 వరకూ** తయారీ కేంద్రాలను గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్నారని తెలుస్తోంది. వీటి విషయంలోనూ **ఎలాంటి తనిఖీలు చేపట్టడం లేదు.**

కనీస పరిశీలనలు శూన్యం!

దరఖాస్తు వచ్చిందా.. లైసెన్స్ ఇచ్చేశామా.. వదిలేశామా.. అనే రీతిలోనే బాణసంచా తయారీ దుకాణాల విషయంలో జిల్లా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఆ దుకాణంలో ఏం తయారు చేస్తున్నారు.? మోతాదుకు మించిన నిల్వలున్నాయా.? గోదాముల పరిస్థితేంటి అనేది పట్టించుకున్న పాపానపోలేదు. అంతేకాదు.. **లైసెన్స్‌లు మంజూరు చెయ్యాలని కొందరు దుకాణదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల్ని పెండింగ్‌లో ఉంచారే తప్ప.. ఆ దుకాణాల దగ్గరకు వెళ్లి.. వాటిని పరిశీలించిన దాఖలాలూ కనిపించడం లేదు.**

ఇక్కడ తయారీ కేంద్రాల పరిస్థితేంటో?

కైలాసపట్నంలో ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు అప్రమత్తత నటిస్తూ హడావిడి చెయ్యడం **మొదలు పెట్టారు. జిల్లాలో**ని అన్ని తయారీ కేంద్రా**ల్ని పరిశీలించేందుకు బృం**దాలు ఏర్పాటు చేస్తున్నట్లు **ఎస్పీ తుహిన్ సిన్హా ప్ర**కటించారు. ఏవైనా నిబంధ**నలకు విరుద్ధంగా నడుస్తు**ంటే వాటిపై చర్యలు తీసు**కుంటామని హెచ్చరించా**రు. ఈ ప్రమాదం జరిగిన **విషయం దావానలంలా** వ్యాపించడంతో.. మిగిలిన **ప్రాంతాల ప్రజలు కూడా** బిక్కుబిక్కుమంటున్నారు. **రాంబిల్లి, దేవరాపల్లి, స**బ్బవరం, అనకాపల్లి మం**డలాల్లో ఈ తరహా తయా**రీ కేంద్రాలు ఇబ్బడి ముబ్బ**డిగా ఉన్నాయి. ఆయా** ప్రాంతాల ప్రజలు తమ వద్ద **ఎలాంటి ప్రమాదం జ**రుగుతుందోనని నిద్రలేని **రాత్రులు గడుపుతున్నారు.** ఇప్పటికే ఫార్మా పరిశ్ర**మల్లో నెలకో ప్రమాదం స**ంభవిస్తుండటంతో పరిసర **ప్రాంత ప్రజలు ఆందో**ళన వ్యక్తం చేస్తుండగా.. తాజాగా.. బాణసంచా ప్రమాదం మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.

ఇరుకు గదుల్లో పనిచేయడం వల్లే ప్రమాద తీవ్రత



యండపల్లిలోని మందుగుండు తయారీ కేంద్రంలో నిర్వాహకుడికి సూచనలు ఇస్తున్న ఫైర్ డీజీ ప్రతాప్, ఎస్పీ తుహిన్ సిన్హా

కోటవురట్ల: ఇరుకు గదుల్లో ఎక్కువ మంది మందుగుండు తయారు చేయడం వల్లనే ఇంత భారీ స్థాయిలో ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) మాదిరెడ్డి ప్రతాప్ తెలిపారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని విజయలక్ష్మి గణేష్ ఫైర్ వర్క్స్‌లో ఆదివారం జరిగిన ప్రమాద స్థలాన్ని డీజీ సోమవారం పరిశీలించారు. ఇక్కడకు దగ్గరలో ఓ చోట భద్రపరిచిన మందుగుండు సామగ్రిని గుర్తించి, వాటిని నీళ్లతో తడిపి పనిచేయకుండా నిర్వీర్యం అయ్యేలా చేశారు. అక్కడి నుంచి యండపల్లిలో ఉన్న మరో తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి పాత్రికేయులతో మాట్లాడారు. ప్రాథమికంగా జరిపిన పరిశీలనను బట్టి చిన్న ఇరుకు గదుల్లో ఎక్కువ మంది పనిచేయడం వల్లనే అధిక ఒత్తిడితో పేలుళ్లు సంభవించాయన్నారు. ఎక్కడైనా ఇటువంటి కేంద్రాలు విశాలమైన ప్రదేశాలలో సాధ్యమైనంత వరకు ఓపెన్ ప్లేస్‌లో విడివిడిగా పనిచేసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. యండపల్లిలోని ఫైర్ స్టేషన్‌ను మంచి వాతావరణంలో ఏర్పాటు చేశారన్నారు. విశాలమైన ప్రదేశం ఉండడంతో పాటు కార్మికులు ఎక్కువ మంది ఒకే చోట ఉండకుండా విడివిడిగా దూరంగా పనులు చేసేలా ఏర్పాడు చేశారన్నారు. ఇటువంటి చోట ప్రమాదం జరిగినా అంత తీవ్రత ఉండదన్నారు. మిగతా అన్ని మందుగుండు తయారీ కేంద్రాలను తనిఖీ చేసి సేఫ్టీ ప్రమాణాలను పరిశీలించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తయారు చేసిన మందుగుండును సాధ్యమైనంత వరకు అండర్‌గ్రౌండ్‌లో నిల్వ చేసేలా ఆలోచించాలన్నారు. ఇక్కడ ఎస్పీ తుహిన్ సిన్హా పరిశీలించి నిర్వాహకుడు రమణకు సూచనలు చేశారు. సేఫ్టీ అంశాలను పాటించాలని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిబంధనలు బేఖాతర్

బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల నిర్వహణ నిబంధనల ప్రకారం నడవాల్సి ఉంటుంది. తయారీ కేంద్రాల నిర్వహణకు కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ, ఫైర్, పోలీస్ శాఖల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పేలుడు పదార్థాల చట్టం 1908 ప్రకారం నిర్దిష్ట ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. అత్యధిక సమయాల్లో అనుమతి లేకుండానే బాణసంచా తయారీ కోసం ప్రయత్నించడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. లైసెన్స్ తీసుకున్న యూనిట్లలో కూడా ప్రమాణాలకు విరుద్ధంగా పరిమితికి మించి ఉత్పత్తి కోసం చేసే యత్నాల్లో నిబంధనలు అతిక్రమించడం మరో కారణం. బాణసంచా తయారీలో నిబంధనలను పాటించకుండా, లాభార్జనే ప్రధానంగా వ్యవహరించడం ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అధికార యంత్రాంగం ఈ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. భారీ పేలుడు సంభవించేందుకు ఆస్కారమున్న పదార్థాలను ప్రత్యేకంగా నిల్వ ఉంచాలి. కానీ అందుకు విరుద్ధంగా భద్రత లేని చోట్ల అన్ని రకాల బాణసంచాని కలిపి ఉంచుతుంటారు. తయారీదారులు ఫైర్ ఫైటింగ్ విషయాల్లో శిక్షణ తీసుకోవాలి. బాణసంచా దుకాణం వద్ద తయారీ ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలి. నాలుగు ఫైర్ సిలెండర్లు, నాలుగు బకెట్లు, నిమిషానికి 450 లీటర్ల కెపాసిటీ గల ఒక డీజిల్ పంపు, 25 వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకు ఉండాలి. అనుమతులకు మించి బాణసంచా సరుకులను తయారు చేయకూడదు. ప్రమాద నివారణ పరికరాలు పనిచేసే విధంగా ఎప్పటికప్పుడు చూసుకోవాలి. పరికరాలను ఉపయోగించేందుకు నలుగురు ఆపరేటర్లు ఉండాలి. తయారీ దుకాణంలో నలుగురికన్నా ఎక్కువ పనిచేయకూడదు. కేంద్రం చుట్టూ రక్షణను ఏర్పాటు చేయాలి. 1908 ఎక్స్‌ప్లోజివ్ చట్టం ప్రకారం అన్ని నిబంధనలు పాటించాలి. తయారీ కేంద్రం దృఢంగా సిమెంటుతో నిర్మించాలి. ప్రతి రెండు గంటలకు ఒకసారి పనిచేసే వారు బట్టలకు తడి చేసుకుంటూ ఉండాలి. ఇలా ఎన్నో నిబంధనలున్నా.. వాటిని పాటిస్తున్న తయారీ కేంద్రాలు జిల్లాలో లేవనే చెప్పొచ్చు. అయినా.. అధికారుల కళ్లకు ఇవేమీ కనిపించకపోవడం గమనార్హం.

ఆత్మీయులకు కన్నీటి వీడ్కోలు

కళ్ల ముందే అన్న బుగ్గిలో కలిశాడు..

- ఎలా బతికానో నాకే తెలీదు
- క్షతగాత్రుడు సంగరాతి శ్రీను

-8లో

అన్ని మందుగుండు తయారీ కేంద్రాల్లో క్షుణ్ణంగా తనిఖీలు



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

కోటవురట్ల: జిల్లాలోని 21 బాణసంచా తయారీ కేంద్రాల్లో క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. సోమవారం ఆయన ప్రమాద స్థలాన్ని, యండపల్లిలో ఉన్న ఫైర్ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మందును దంచేటప్పుడు ఏర్పడిన రవ్వలతోనే ప్రమాదం సంభవించినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ముందు రెండో యూనిట్, తర్వాత మొదటి యూనిట్లో మంటలు చెలరేగి పేలుళ్లు సంభవించినట్టు తెలిపారు. ఎస్‌డీఆర్‌ఎఫ్, ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్, క్లూస్ టీం ఆధారాలు సేకరించి పరీక్షకు పంపించినట్టు తెలిపారు.

వెంటనే స్పందించిన పోలీసులు: శబ్దం వచ్చిన వెంటనే ఎస్‌ఐ రమేష్, తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులు దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్త పడ్డారని ఎస్పీ తెలిపారు. ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులను రప్పించి పోలీసులు, స్థానికులు, ఆస్పత్రి, ఫైర్ సిబ్బంది సహాయంతో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించామన్నారు. డోన్ సహాయంతో ఆరు టీమ్స్ పనిచేస్తున్నాయని, పేలుడు పదార్థాలను పసిగట్టే జాగిలాన్ని వినియోగించినట్టు తెలిపారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో 42/2025 సెక్షన్ 105, 125(ఎ) బీఎస్ఎస్ సెక్షన్ 3, 5 ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్టుగా కేసు నమోదు చేశారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తయారీ కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలను సమీక్షిస్తామని తెలిపారు. ప్రాణనష్టం ఎక్కువ జరగకుండా సకాలంలో స్పందించి చర్యలు తీసుకున్నందుకు ఎస్‌ఐ రమేష్‌ను ప్రశంసించారు.

ప్రైవేట్ ఆస్పత్రికి ఇద్దరి తరలింపు

- కేజీహెచ్‌లో నలుగురికి వైద్య సేవలు
- నర్సీపట్నంలో కోలుకుంటున్న ఇద్దరు



కోలుకుంటున్న క్షతగాత్రుడు సూరిబాబు

మహారాణిపేట (విశాఖ)/నర్సీపట్నం: కైలాసపట్నం ప్రమాదంలో గాయాలైన నలుగురు క్షతగాత్రులకు కేజీహెచ్‌లో వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న ఫైర్ వర్క్స్ మేనేజర్ మడగల జానకీరాం, సియ్యాద్రి గోవిందలను మెరుగైన వైద్య కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మొత్తం ఆరుగురు క్షతగాత్రులను తీసుకొని వచ్చి కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చేర్పించారు. తీవ్రంగా గాయపడ్డ జల్లూరి నాగరాజుకు సీఎస్ఆర్ బ్లాక్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగరాతి శ్రీను, గుప్పెన సూరిబాబు కోలుకుంటున్నారు.

న్యూస్‌రీల్

సంగీతంలో సీడీపీవో ప్రతిభ

- క్రీస్తు గీతాలాపనలో గిన్నిస్ వరల్డ్ రికార్డు



మెడల్, సర్టిఫికెట్‌తో సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం: నర్సీపట్నం సీడీపీవో మేరీ సువార్త బృందం సంగీతంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. హైదరాబాద్ హోలెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వాహకుల చేతుల మీదుగా ఆమె సోమవారం మెడల్ అందుకున్నారు. ఉన్నత విద్యను అభ్యసించి మహిళా శిశు సంక్షేమశాఖలో సీడీపీవోగా కొలువు సాధించిన మేరీ సువార్తకు సంగీతం అంటే మక్కువ. హోలెల్ మ్యూజిక్ స్కూల్ ప్రోత్సాహంతో క్రిస్టియన్ గీతాలపై ప్రపంచ స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. కీబోర్డు వాయిస్తున్న సంగీత కళాకారుల బృందం గంటలో 1046 వీడియోలు అప్‌లోడ్ చేశారు. ప్రపంచ రికార్డు నెలకొల్పిన ఈ బృందంలో మేరీ సువార్త ఉన్నారు. పాస్టర్ ఆగస్టిన్ చేతుల మీదుగా మెడల్‌తోపాటు సర్టిఫికెట్ ఆమె అందుకున్నారు. పట్టుదలతో సంగీతం నేర్చుకున్నానని, గిన్నిస్ వరల్డ్ రికార్డుతో అరుదైన గౌరవం దక్కిందని సీడీపీవో ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారం

- ముగ్గురు ఇంటర్ విద్యార్థుల ఎంపిక



శ్రీనుకు స్వీటు తినిపిస్తున్న తల్లి కొండమ్మ

నర్సీపట్నం/రావికమతం: ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పురస్కారానికి అర్హత సాధించారు. నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూపు అయిన ఎంఎల్టీ కోర్సులో 989 మార్కులు సాధించిన సిరసపల్లి హరిత జిల్లా నుంచి ఎంపికైన వారిలో ఒకరు. రావికమతం మండలం, మేడివాడ గ్రామానికి చెందిన ఆమె తండ్రి దొరబాబు ఆటో డ్రైవర్, తల్లి పద్మ గృహిణి. వైద్యరంగం మీద ఉన్న మక్కువతో చిన్నప్పటి నుంచి ఇష్టపడి చదివానని హరిత తెలిపింది. ప్రిన్సిపల్ వి.వి.పద్మావతి, అధ్యాపకుల సూచనలతో మంచి మార్కులు సాధించగలిగానని తెలిపింది. బీఎస్సీ (ఎంఎల్టీ) చదివి, సివిల్స్‌పై దృష్టి పెడతానని హరిత తెలిపింది. నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని బీఅండ్ఆర్ఎం (బ్యాంకింగ్ అండ్ రిటైల్ మార్కెటింగ్) బ్రాంచ్‌లో ఇంటర్ చదివిన విద్యార్థి రావుల మౌళి కిరణ్ ప్రభుత్వ సత్కారానికి ఎంపికయ్యాడు. స్వస్థలం కొయ్యూరు మండలం, మర్రిపాలెం గ్రామం. తండ్రి సింహాచలం ఉపాధి హామీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అమ్మ వెంకటలక్ష్మి గృహిణి. ఇటీవల వెలువడిన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో 978 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు, ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.పద్మావతి, అధ్యాపకుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించానని, సివిల్స్ సాధించాలన్నది తన లక్ష్యమని మౌళి కిరణ్ తెలిపాడు.



రావుల మౌళి కిరణ్



సిరసపల్లి హరిత

బ్యాంక్ మేనేజర్ అవ్వాలని ఉంది

తనకు బ్యాంక్ మేనేజర్ అవ్వాలని ఉందని వొకేషనల్‌లో 941 మార్కులు సాధించిన రావికమతం మండలం కొత్తకోట ప్రభుత్వ కళాశాల విద్యార్థి గొలగాని శ్రీను తెలిపాడు. అతని స్వగ్రామం రావికమతం మండలం జెడ్.కొత్తపట్నం. తల్లిదండ్రులు తాతబాబు, కొండమ్మ వ్యవసాయ కూలీలు. తనకు రెండు కాళ్లు సరిగా పనిచేయవని, ఎక్కువ దూరం నడవలేని పరిస్థితిలో ఉన్న తాను తల్లిదండ్రుల ప్రోత్సాహం, పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవతి, ఉపాధ్యాయులు చూపించిన ప్రత్యేక శ్రద్ధ వల్లే తాను మంచి మార్కులు సాధించగలిగానని తెలిపాడు. ఈ ముగ్గురూ ఈనెల 15న ముఖ్యమంత్రి నుంచి సత్కారాలు అందుకుంటారు.

భరోసా దక్కని బతుకులు

- గంగపుత్రుల ఆకలి కేకలు
- అమల్లోకి వచ్చిన వేట నిషేధం
- గత ఏడాది మత్స్యకార భృతికే అతీగతీ లేని వైనం



వేట నిషేధ సమయంలో వలలు, తెప్పలను రిపేర్లు చేసుకుంటున్న మత్స్యకారులు

నక్కపల్లి: మత్స్యకారులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం అమలులోకి వస్తోంది. జూన్ 15 వరకు కొనసాగనుంది. మత్స్య సంపద ఉత్పత్తి అయ్యే సమయం కావడంతో ప్రతి ఏటా రెండు నెలలపాటు వేట నిషేధం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో సంపాదన లేక ఖాళీగా ఉండే గంగపుత్రుల జీవనానికి ప్రభుత్వం భృతి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకముందు రూ.2 వేల చొప్పున పరిహారం అందజేసేవారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎప్పుడో ఆరేడు నెలల తర్వాత భృతి మంజూరు చేసేది. అది కూడా స్థానికంగా పలుకుబడిన నాయకుల అనుచరులకు మాత్రమే ఇచ్చేవారు. పాదయాత్రలో గంగపుత్రుల సమస్యలు స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వేట నిషేధ నష్టపరిహారం రూ.10 వేలకు పెంచడంతోపాటు ప్రతి ఏటా మే నెలాఖరుకు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేశారు. ఇలా ఐదేళ్ల పాటు నిరాటంకంగా మత్స్యకార భరోసాను అమలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకార భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామని టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించాయి. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది ఇవ్వాల్సిన భరోసా ఇంతవరకు అమలు చేయలేదు. అసలు ఎప్పుడిస్తారో కూడా చెప్పలేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 34 తీరప్రాంతాల్ని ఆనుకుని మత్స్యకార గ్రామాలున్నాయి. వీటిలో లైసెన్స్ కలిగిన మెకనైజ్డ్ బోట్లు, ఇంజను బోట్లు, తెప్పలు, తెరచాపలతో సముద్రంలో వేట సాగించే మత్స్యకారులు సుమారు 26 వేల మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఇస్తానన్న రూ.20 వేలు ఇవ్వకపోగా గత ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు కూడా ఇవ్వడం మానేసిందంటూ గంగపుత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గత ఏడాది నష్టపరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈసారి ఎన్ని తిప్పలో..!



వేట నిషేధ సమయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. ఐదేళ్లపాటు క్రమం తప్పకుండా మే నెలాఖరుకు మా ఖాతాలో జమ చేశారు. కూటమి ప్రభుత్వం ఈ పరిహారాన్ని రూ.20 వేలకు పెంచుతామని చెప్పింది. పెంచడం మాట దేవుడెరుగు.. గత ఏడాది ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఈ అర్ధరాత్రి నుంచి వేట నిషేధం అమల్లోకి వచ్చేసింది. ఈసారి ఎన్ని తిప్పలు పడాలోనని భయమేస్తోంది.

–యజ్జల అప్పలరాజు, రాజయ్యపేట

మాట నిలబెట్టుకోవాలి



జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంగపుత్రుల బెంగ తీరింది. వేట నిషేధ సమయంలో రూ.10 వేల నష్టపరిహారాన్ని వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేవారు. తమ హయాంలో రూ.2 వేలే ఇచ్చిన టీడీపీ ఎన్నికల ముందు రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. గత ఏడాది అసలు భృతే ఇవ్వకుండా ఎగ్గొట్టింది. రూ.20 వేల మాట దేవుడెరుగు.. గతంలో ఇచ్చినట్టు రూ.10 వేలైనా ఇస్తే బాగుంటుంది.

–గోసల కాసులమ్మ, మత్స్యకార మహిళ, జెడ్పీటీసీ, నక్కపల్లి

క్లుప్తంగా

బాణసంచా గోడౌన్ తనిఖీ చేసిన డీఎస్పీ శ్రావణి



చోడవరంలో హోల్‌సేల్ విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రావణి

చోడవరం :

బాణా సంచా విక్రయ, తయారీ కేంద్రాల్లో నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రావణి హెచ్చరించారు. కోటవురట్ల మండలం ఏటిపాకల బాణాసంచా తయారీ కేంద్రంలో ఇటీవల జరిగిన భారీ పేలుడు ప్రమాదం నేపథ్యంలో చోడవరంలో ఉన్న ఉప్పల సతీష్ బాణాసంచా హోల్‌సేల్ విక్రయ కేంద్రాన్ని, అంకుపాలెంలో ఉన్న బాణాసంచా తయారీ కేంద్రాన్ని డీఎస్పీ శ్రావణి సోమవారం తనిఖీ చేశారు. ఫైర్ సేఫ్టీ, గొడౌన్ల నిర్వహణ, గొడౌన్‌లో ఉన్న బాణాసంచా సరుకుల వివరాలను పరిశీలించారు. పేలుడు పదార్థాలు విక్రయంలో జాగ్రతలు తీసుకోవాలన్నారు.

లైసెన్సులు లేకుండా ఎవరైనా పేలుడు పదార్థాలు, బాణాసంచా తయారీ, విక్రయాలు చేస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఏఏ సమయాల్లో విక్రయాలు చేస్తారని ఆమె ఆరా తీశారు. చోడవరం సీఐ అప్పలరాజు, ఎస్‌ఐలు, అగ్నిమాపక సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి హోంమంత్రి అపచారం

- టీడీపీ సీనియర్ నేత పైడారావు ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న విల్లూరి పైడారావు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నాలుగురోడ్ల జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని హోంమంత్రి వంగలపూడి అనిత అవమానించారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ ప్రదేశంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కనీసం అంబేడ్కర్ గురించి మాట్లాడక పోవడం బాధాకరమన్నారు. రిజర్వేషన్ కోటాలో మంత్రి అయిన అనిత నాలుగురోడ్ల జంక్షన్ వద్ద ప్రవర్తించిన తీరు ఆమె అహంకారానికి నిదర్శనమన్నారు.

ఆత్మీయులకు కన్నీటి వీడ్కోలు

కోటవురట్ల: నవ్వులు రువ్వే మోములు ఇక కనిపించవు...ఆత్మీయ పిలుపులు ఇక వినిపించవు...రెప్పపాటులో కనుమరుగైపోయారు..ఆత్మీయులకు శోకం మిగిల్చారు. కుటుంబమే జీవితంగా బతికిన వారు...అందరి తలలో నాలుకలా మెదిలినవారు ఆత్మీయత పంచేవాళ్లు...విధి వక్రించి ఆదివారం బాణసంచా ప్రమాదంలో అశువులు బాశారు... బాణసంచా పేలుడు ప్రమాదంలో మృతి చెందిన ఎనిమిది మందిలో ఆరుగురు మండలానికి చెందిన వారే. అందులో నలుగురు కైలాసపట్నానికి చెందిన అప్పికొండ తాతబాబు, సంగరాతి గోవిందు, గుంపిన వేణు, పురం పాప కాగా రాజుపేట చెందిన దాడి రామలక్ష్మి, చౌడువాడకు చెందిన శానాపతి పైడియ్యనాయుడు(బాబూరావు) ఉన్నారు.

మృతదేహాలను ఆదివారం నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ ఆదేశాలతో ఆ రాత్రి 12 గంటలకే పోస్టుమార్టం చేశారు. సోమవారం ఉదయం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా కన్నీటి వీడ్కోలు పలుకుతూ కుటుంబసభ్యులు దహనక్రియలు చేశారు. పెద్ద సంఖ్యలో స్థానికులు, బంధువులు దహనక్రియల్లో పాల్గొన్నారు. కైలాసపట్నం, రాజుపేట, చౌడువాడ గ్రామాలలో విషాదం చోటుచేసుకుంది.



కైలాసపట్నంలో మృతదేహం వద్ద కుటుంబసభ్యులు

కష్టాల బతుకు కడతేరిపోయింది..

రాజుపేటకు చెందిన రామలక్ష్మిది నలుగురిలో కలిసిపోయి కలివిడి గుణం కలిగిన వ్యక్తిత్వం ఆమెది. ఆదివారం కైలాసపట్నంలోని బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదంలో రామలక్ష్మి కూడా మృతి చెందింది. ఇరవై ఏళ్లుగా కష్టపడి ఒంటరి జీవితం గడిపిన రామలక్ష్మికి ఆ దేవుడు సెలవిచ్చేసినట్టున్నాడు. రామలక్ష్మిని పెళ్లి చేసుకున్న వ్యక్తి కొన్నాళ్లకే వదిలేసి వెళ్లిపోయాడు, ఆమెకు ఓ అమ్మాయి కావడంతో భర్త లేకపోయినా కష్టపడి పనిచేసుకుంటూ కూతురిని పెంచి పెద్ద చేసి పెళ్లి చేసి అత్తారింటికి పంపించేసింది. ఒంటరిగా బతుకుతున్న రామలక్ష్మి బాణసంచా కేంద్రంలో పని చేస్తూ అద్దె ఇంట్లో నివసిస్తోంది. జీవితమంతా పేదరికంతోనే కాలం నెట్టుకొచ్చింది. రామలక్ష్మి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



రామలక్ష్మి

గోవిందుడు అందరివాడు..

గోవిందు వచ్చాడంటే అంతా సరదా సరదానే..వెనుక ఎన్ని కష్టాలున్నా నవ్వడం, నవ్వించడం మాత్రమే గోవిందుకు తెలుసు. గోవిందుడు అందరి వాడులా అందరితో సరదాగా గడిపే వ్యక్తి. కష్టపడి పనిచేసుకోవడం.. పొద్దుపోయాక మిత్రులతో కలిసి సరదాగా గడిపేయడం గోవిందు నైజం. ఆదివారం జరిగిన బాణసంచా ప్రమాదంలో సంగరాతి గోవిందు కూడా ప్రాణాలు కోల్పోయాడు. మధ్యాహ్నం అన్నం తినేందుకు సిద్ధమయ్యేలోగానే అనంతలోకాలకు పోయాడు. కైలాసపట్నానికి చెందిన గోవిందుకు భార్య జయలక్ష్మి, ఇంటర్ చదువుతున్న కొడుకు మహేష్, బీటెక్ చేస్తున్న లహరి ఉన్నారు. పిల్లలు ఇద్దరినీ బాగా చదివిస్తూ వారికి మంచి జీవితం ఇవ్వాలనే తపనతో గోవిందు కష్టించి పనిచేసేవాడు. పిల్లల ఉన్నత స్థితి చూడకముందే గోవిందు వారిని విడిచిపోయాడు.



పిల్లలతో గోవిందు భార్య (ఇన్‌సెట్) గోవిందు (ఫైల్)

నవ్వులరేడు ఇక లేడు..



తాతబాబు

అందమైన చిన్ని కుటుంబం ..సాఫీగా సాగుతున్న జీవితం.. అంతలో జీవితంలో పెనువిస్ఫోటనం. బాణసంచా పేలుడు ప్రమాదంలో మృతుల్లో ఒకరైన అప్పికొండ తాతబాబు కైలాసపట్నం గ్రామానికి చెందినవాడు. తాతబాబు వచ్చాడంటే అక్కడ నవ్వులు విరబూయాల్సిందే. నోరు విప్పాడంటే పంచ్ పడాల్సిందే. ఆ తాతబాబు ఇపుడు మనమధ్య లేడంటే ఎవరూ ఊహించలేకపోతున్నారు. తాతబాబు ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ ఖాళీగా ఉండకుండా తన తోడల్లుడు జానకీరాం నిర్వహిస్తున్న బాణసంచా కేంద్రంలో సాయంగా ఉంటూ పనిచేస్తుంటాడు. ఆదివారం జరిగిన ప్రమాదంలో తాతబాబు మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కష్టాలు మరిచి మనసారా నవ్వించే తాతబాబు లేని లోటు తీర్చలేనిదని గ్రామస్తులంటున్నారు. తాతబాబుకు భార్య నాగలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు.

అల్లుళ్లకు చేదోడుగా ఉంటూ...

చౌడువాడకు చెందిన శానాపతి పైడియ్యనాయుడు(బాబూరావు) తన పనేదో తాను చేసుకుంటూ పోతాడే తప్ప ఇతరుల మధ్యలోకి దూరడు. అనవసర విషయాలకు దూరంగా ఉంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు అమ్మాయిలు కాగా పెద్ద కూతురుని కైలాసపట్నానికి చెందిన సొంత బావమరిది అప్పికొండ తాతబాబుకు ఇచ్చి పెళ్లి చేశాడు. మరో కూతురుని ఎస్.రాయవరం మండలం గోకులపాడుకు చెందిన మడగల జానకీరాంకు ఇచ్చి పెళ్లి చేశాడు. అల్లుళ్లు ఇద్దరూ మంచి జీవితాన్నే గడుపుతుండగా వారికి చేదోడుగా ఉంటూ పైడియ్యనాయుడు కాలం వెల్లదీస్తున్నాడు. తన చిన్నల్లుడు జానకీరాం నిర్వహిస్తున్న బాణసంచా కేంద్రంలో సహాయంగా ఉంటూ అక్కడ పనిచేస్తున్నాడు. ఈ ప్రమాదంలో తన పెద్దల్లుడు తాతబాబుతో సహా పైడియ్యనాయుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఆ కుటుంబంలో పెద్ద విషాదం చోటుచేసుకుంది.



శానాపతి పైడియ్య నాయుడు

అన్నీ కష్టాలే 'పాప'ం

కైలాసపట్నానికి చెందిన పురం పాప చివరి శ్వాస వరకూ కష్టాల కడలిలోనే జీవించింది. బాణసంచా ప్రమాదంలో పురం పాప మృతిచెందడంతో ఆమె కుటుంబం తేరుకోలేకపోతోంది. పాప మొదటి నుంచి కష్టించి పనిచేసే తత్వం కలిగిన మనస్తత్వం. పాప భర్త అప్పారావు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమెకు పార్వతి, రాజేశ్వరి ఇద్దరు కూతుళ్లతో పాటు దొరబాబు అనే కొడుకు ఉన్నాడు. ముగ్గురికీ వివాహాలు కాగా చిన్న కూతురు, అల్లుడు, కొడుకు దొరబాబు, కోడలు హైదరాబాదులో కూలిపని చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. ఇక పెద్ద కూతురు పార్వతి తల్లి పాప వద్దే నివసిస్తోంది. బాణసంచా కేంద్రంలో పని చేస్తూ కూతురు పార్వతికి చేదోడుగా ఉంటోంది. ప్రమాదంలో మృతి చెందడంతో కూతుళ్లు, కొడుకు తేరుకోలేకపోతున్నారు.



దుఃఖసాగరంలో ఉన్న కుమార్తెలు, కొడుకు (ఇన్‌సెట్) పురం పాప

సడిలేని మగ్గం...



వేణు భార్య, కుమారుడు



వేణు ఒకప్పుడు వాడిన చేనేత మగ్గం, (ఇన్‌సెట్) వేణు (ఫైల్)

ఎంత కష్టపడినా పేదరికం అతనిని చివరి వరకు అంటుపెట్టుకునే ఉంది. ఏ పనిచేసినా కలిసిరాక జీవితం అంతా కష్టాలబాటలోనే నడిచింది. అయినా ఎప్పుడూ నవ్వుతూ ఉండే వేణు ఎక్కడ ఉంటే అక్కడ నవ్వుల పండుగే. కైలాసపట్నం వీవర్స్ కాలనీకి చెందిన గుంపిన వేణు బాణసంచా ప్రమాద మృతుల్లో ఒకడు. వేణుకు భార్య దేవి, కుమారుడు సాయి ఉన్నారు. వేణు చిన్నతనం నుంచి చేనేత మగ్గాన్ని నేసేవాడు. కలిసిరాక పోవడంతో గత్యంతరం లేక బాణసంచా కేంద్రంలో పనికి ఎనిమిదేళ్ల క్రితం చేరాడు. అప్పటి నుంచి అక్కడే పనిచేస్తూ భార్య, కుమారుడిని పోషిస్తున్నాడు. మంచి వ్యక్తిగా పేరున్న వేణు ఇక లేడంటే నమ్మలేకపోతున్నారు.

కళ్ల ముందే అన్న బుగ్గిలో కలిశాడు..

- ఎలా బతికానో నాకే తెలీదు
- క్షతగాత్రుడు సంగరాతి శ్రీను
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కోలుకుంటున్న ఇద్దరు క్షతగాత్రులు

నర్సీపట్నం : కోటవురట్ల మండలం, కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడులో ఎనిమిది మంది చనిపోగా మరో ఎనిమిది మంది గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రుల్లో గుప్పెన సూరిబాబు, సంగరాతి శ్రీను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారు. ఇద్దరు వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెబుతున్నారు. క్షతగాత్రులు ఇద్దరూ ఘటన నుంచి ఇంకా తేరుకోలేదు. తమతో పనిచేసే వారు కళ్ల ముందే మాయమవటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటన నుండి తాను ఎలా బతికి బయటపడ్డానో ఇప్పటికీ అంతుచిక్కడం లేదని క్షతగాత్రుడు శ్రీను తెలిపాడు. 'మా పెదనాన్న కొడుకు మా అన్నయ్య సంగరాతి గోవిందు ఇద్దరం ఒకే చోట పని చేస్తున్నాం..గోవిందు పేపరు అందిస్తుంటే నేను ఆ పేపర్‌ను తయారు చేసిన బాంబులకు చుడుతున్నాను. ఇంకాసేపట్లో భోజనానికి లెగుస్తాం అనగా ఇంతలోనే ప్రమాదం జరిగిపోయింది. భారీ పేలుడుతో నేను గెడ్డవైపు తుల్లిపడిపోయాను.. పడడమే గుర్తుంది. తరువాత ఏం జరిగిందో తెలియదు..' అంటూ నాటి దుర్ఘటన గురించి శ్రీను తెలిపాడు. ఆదివారం పనికి మానేద్దాం అనుకున్నానని గుంపున వేణు సూరిబాబు తెలిపాడు. 'భార్య, పిల్లలు కూడా పనికి వెళ్లొద్దని చెప్పారు.. మధ్యాహ్నం వరకే కదా.. అని వెళ్లి ప్రమాదం బారిన పడ్డాను.. ఈ సంఘటన నుంచి బయటపడడం నాకు పునర్జన్మే..' అంటూ క్షతగాత్రుడు సూరిబాబు కంటతడిపెట్టాడు.



ఆస్పత్రిలో కోలుకుంటున్న క్షతగాత్రుడు సంగరాతి శ్రీను

క్షతగాత్రులకూ పరిహారం ప్రకటించాలి

- బాణసంచా బాధితులకు సీపీఎం నేతల పరామర్శ

మహారాణిపేట (విశాఖ): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం సీపీఎం కేంద్రం కమిటీ సభ్యుడు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ క్షతగాత్రులు ఆస్పత్రిలో చేరిన తరువాత పట్టించుకొనే నాథులే కరువయ్యారన్నారు. వారికి మంచినీరు, ఆహారం, ఇతర అవసరాలను కూడా ప్రభుత్వాధికారులు పట్టింకోవడం లేదని క్షతగాత్రులు సీపీఎం బృందం వద్ద వాపోయారు. దీంతో బాధితులందరికీ సీపీఎం నాయకులు వస్త్రాలు అందజేశారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ప్రాంతంలో వారికి సహాయకులను ఏర్పాటు చేసి వారు పూర్తిగా కోలుకొనే వరకు ప్రభుత్వమే వారిని చూసుకోవాలని, జిల్లాలో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నా వాటిని అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమౌతున్నారని అన్నారు. బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి భద్రతా లోపాలు ఉన్నచోట వెంటనే చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు క్షతగాత్రులకు కూడా పరిహారం ప్రకటించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహార, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బాధితులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకుడు కె.లోకనాథం, కోటీశ్వరరావు, ఎం.అప్పలరాజు

రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలి

నర్సీపట్నం : కోటవురట్ల మండలం, కైలాసపట్నం బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీపీఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేజీహెచ్‌లో ఏడుగురు, ఏరియా ఆస్పత్రిలో ఇద్దరు వైద్యం పొందుతున్నారన్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. కంటిచూపు, వినికిడి, ఇతర వైకల్యం కలిగిన వారికి సర్టిఫికెట్లు జారీ చేసి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. బాణాసంచా తయారీ కేంద్రాలపై అగ్నిమాపక అధికారుల పర్యవేక్షణ లోపం ఉందన్నారు. ఇలాంటి ప్రమాదాలు సంభవించకుండా భద్రతా ప్రమాణాలు పాటించేవిధంగా చూడాలన్నారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు ఎల్.గౌరి, సూర్యప్రభ, శివ, రామకృష్ణ ఉన్నారు.



నర్సీపట్నం ఆస్పత్రిలో క్షతగాత్రులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కూలి పనికి వెళ్లి యువకుడు మృతి



మృతి చెందిన దుర్గాప్రసాద్ (ఫైల్)

రావికమతం : కాకినాడ జిల్లా ఉప్పాడ పోలీసు స్టేషన్ పరిధిలో మూలపేట సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన యువకుడు ఎద్దు దుర్గాప్రసాద్ (24) దుర్మరణం చెందగా మరో ఇద్దరు యువకులు గుడాల నవదీప్, కనికెళ్లి దేవరాజు స్వల్పంగా గాయపడ్డారు. మృతుని బంధువులు తెలిపిన వివరాలివి. కొత్తకోట గ్రామానికి చెందిన ఎద్దు అచ్చిబాబు, రమణమ్మల కుమారుడు దుర్గాప్రసాద్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మానేసి కాకినాడ జిల్లా ఉప్పాడ సమీపంలో మూలపేట చేపల ఫ్యాక్టరీలో అదే గ్రామానికి చెందిన గుడాల నవదీప్, కనికెళ్లి దేవరాజుతో కలిసి పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి ఫ్యాక్టరీ క్యాంటీన్‌లో ముగ్గురూ భోజనం చేసి రాత్రి సుమారు 9 గంటల సమయంలో రూమ్‌కు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లైట్లు లేని బైక్‌తో బలంగా ఢీకొట్టడంతో దుర్గాప్రసాద్ బైక్‌పై నుంచి పడిపోయాడు. తలకు బలమైన గాయం తగలడంతో కొద్దిసేపటికే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్పగాయాలు కాగా వారిని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఘటనపై ఉప్పాడ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బస్సులో వృద్ధుడిపై దాడి

యలమంచిలి రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్‌లో సోమవారం సాయంత్రం ఆగి ఉన్న యలమంచిలి నుంచి విశాఖపట్నం వెళ్లే 500వై బస్సులో ప్రయాణికుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో బస్సు సీట్లో కూర్చుని ఉన్న సుమారు 60 ఏళ్ల వృద్ధుడిపై మరొక ప్రయాణికుడు పిడిగుద్దులు గుద్దుతూ భౌతికదాడికి పాల్పడ్డాడు. అతడు కొడుతున్నా పక్కనున్న ప్రయాణికులు ఎవరూ ఆపకపోవడంతో వృద్ధుడు ముఖం, ఇతర శరీర భాగాలపై రక్తగాయాలయ్యాయి. ఓ యువకుడు, మహిళ, డ్రైవర్లు అతడిని వారించే ప్రయత్నం చేశారు. దాడికి పాల్పన్న వ్యక్తిని అతికష్టం మీద బస్సు నుంచి కిందికి దింపి, బస్సును పంపేశారు. అయితే గాయపడిన వృద్ధుడి ఆరోగ్య పరిస్థితి తెలియ లేదు. తన పక్కనున్న మహిళకు మరో ప్రయాణికుడి చేయి తగలడంతో చూసి నడవండి..అంటూ వృద్ధుడు చెప్పడంతో ఆగ్రహానికి గురైన ఆ వ్యక్తి విచక్షణ రహితంగా దాడికి పాల్పడినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే యలమంచిలి బస్‌కాంప్లెక్స్‌లో ఇటీవల పోకిరీలు, మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా కళాశాల, పాఠశాల విద్యార్థినులను కొందరు ఆకతాయిలు వేధిస్తున్నారు. బస్‌కాంప్లెక్స్‌లో తిష్ట వేసి ఉంటున్నారు. బస్‌కాంప్లెక్స్ పరిసరాల్లో పోలీసులు నిఘా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమానత్వం కోసం పరితపించిన అంబేడ్కర్



డాక్టర్ అంబేడ్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రావణి

తుమ్మపాల: దేశంలో సమానత్వం, స్వేచ్ఛ కోసం రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరితపించారని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుండాల జంక్షన్ వద్ద ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం ఏకతాటిపై నడవటానికి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. దీనికి విద్య అనే అంశమే ఆయుధంగా ఉపయోగపడిందన్నారు. అంబేడ్కర్ ఎన్నో అవమానాలు పడ్డారని, స్వేచ్ఛ, సమానత్వం కోసం ఎన్నో పోరాటాలు చేసారని కొనియాడారు. కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ విద్య ద్వారానే అత్యున్నత స్థానానికి చేరుకోవచ్చునని స్పష్టం చేశారు. దీనికి అంబేడ్కర్ మహనీయుని జీవితమే ఉదాహరణ అన్నారు. ఎమ్మెల్యే కొణతల రామకృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ కేవలం దళితులకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికి ఆదర్శనీయులన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, రాష్ట్ర గృహ నిర్మాణం, గవర కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, మళ్ల సురేంద్ర, తదితరులు నివాళులర్పించారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఎం.శ్రావణి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుచుకుంటూ, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాత్ర వహించాలన్నారు. సీఐలు బాల సూర్యరావు, టివి.విజయ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

అనకాపల్లి రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరిగింది. అంబేడ్కర్ చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ బీవీ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రేమించిన అమ్మాయి కోసం వైజాగ్ వచ్చేవాడిని

హిట్ 3 ట్రైలర్ రిలీజ్ వేడుకలో హీరో నాని



సీతమ్మధార: పెళ్లికి ముందు ఓ అమ్మాయిని కలిసేందుకు వైజాగ్ వచ్చేవాడిని.. అంటూ నేచురల్ స్టార్ నాని తన పర్సనల్ సీక్రెట్ బయటపెట్టారు. ఆయన లీడ్ రోల్‌లో దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన హిట్- 3 సినిమా ట్రైలర్‌ను నగరంలోని సంగం థియేటర్‌లో సోమవారం రిలీజ్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాని సినిమాతో పాటు పలు విషయాలు పంచుకున్నారు. 'నా పెళ్లికి ముందు దాదాపు 15 ఏళ్ల క్రితం ఇక్కడికి ఓ అమ్మాయిని కలవడానికి వచ్చేవాడిని, తర్వాత ఆ అమ్మాయినే పెళ్లి చేసుకున్నాను. నాకు వైజాగ్‌తో స్పెషల్ బాండ్ ఏర్పడింది. అప్పుడైనా, ఇప్పుడైనా వైజాగ్‌కు వచ్చింది ప్రేమ కోసమే. వేరే ఎక్కడికి వెళ్లినా నన్ను వాళ్ల అన్న లేదా తమ్ముడిలా చూస్తారు. కానీ వైజాగ్ వచ్చినప్పుడు మాత్రం అల్లుడిలాగే చూస్తారు'.. అంటూ నాని తన భార్య గురించి, వైజాగ్‌తో ఉన్న అనుబంధాన్ని షేర్ చేసుకున్నారు. ఇక ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హిట్- 3 అనేది కొత్త జానర్. ఇందులో మనకు అలవాటు లేని కొత్త టోన్ ఉంటుంది. కొత్త ప్రయత్నాలను తెలుగు ప్రేక్షకులు ఆదరించారనడానికి వంద ఉదాహరణలు ఉన్నాయని, మే 1న మనమంతా గెలుస్తామన్న నమ్మకం ఉందన్నారు. అనంతరం సినిమాలో డైలాగ్‌తో నాని అభిమానులను అలరించారు.

క్లుప్తంగా

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

అనకాపల్లి టౌన్: స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదంలో ప్రాణాలర్పించిన అగ్ని మాపక సిబ్బందికి రెండు నిమషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు డీఎఫ్‌వో ఆర్.వి. రమణ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్‌వో నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



వక్తృత్వ పోటీలో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గ్రేస్

కశింకోట: తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకున్నారు. తీడ గ్రామంలో అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఈ పోటీలు నిర్వహించారు. గురుకుల విద్యార్థినులు సీనియర్ విభాగంలో పి. దేదీప్య ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, బి. దుర్గాభవానీ ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, జూనియర్ విభాగంలో ఎం. ఐశ్వర్య ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, పి. భార్గవి కన్సొలేషన్ బహుమతి గెలుచుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ జి. గ్రేస్ అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కశింకోట: స్థానిక రిక్షా స్టాండ్ వద్ద యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రిక్షా కార్మికులు, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

యూకలిప్టస్ తోట దగ్ధం

అచ్యుతాపురం రూరల్: మడుతూరులో మోటూరు త్రినాథ్ స్వామికి చెందిన యూకలిప్టస్ తోట దగ్ధమైంది. సర్వే నంబరు 242 సుమారుగా ఎ.1.50 సెంట్లు యూకలిప్టస్ తోట కాలిపోయింది.



రైల్వే స్టేషన్ ప్రాంతంలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు



కుక్క కాటు చికిత్సకు వినియోగించే వ్యాక్సిన్



ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఏనిమల్ బైట్ క్లినిక్

వీధి కుక్కలతో బెంబేలు



కుక్క కాటుకు గురైన బాలుడికి ఇంజక్షన్ వేస్తున్న నర్సు

- పట్టణంలో విచ్చలవిడిగా సంచారం
- చిన్నారులతోపాటు పెద్దలపైన దాడులు
- ఎన్టీఆర్ ఆస్పత్రికి పెరుగుతున్న బాధితులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఏ వీధిలో చూసినా కుక్కల గుంపే... విచ్చలవిడిగా ఇవి సంచారం చేస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. దారిన పోయే వాహనదారులను వెంటాడుతూ కరుస్తున్నాయి. చిన్నారులను వదలడం లేదు. దాంతో కుక్కకాటు బాధితులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. పట్టణం, మండలం, సమీప గ్రామాల నుంచి రోజుకు 30 నుంచి 40 మంది వరకు జిల్లా ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఏనిమల్ బైట్ క్లినిక్‌కు చికిత్స కోసం వస్తున్నారు.

గుంపులుగా సంచారం..

భీమునిగుమ్మం, ఆమంచివారి వీధి, చిన్నవీధి, గవరపాలెం, మళ్ల వీధి, వేల్పుల వీధి, విజయరామరాజు పేట, గాంధీనగరం ఇలా ఏ వీధి చూసినా ఎక్కడ పడితే అక్కడ గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరిపైనా దాడి చేస్తున్నాయి. ఉదయమే రింగ్ రోడ్, మెయిన్ రోడ్, శారదానగర్ ప్రాంతాల్లో వాకింగ్ వెళ్లే వారిపైనా, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులపైన కుక్కలు దాడులకు తెగబడుతున్నాయి. బైక్‌లపై వెళ్లేవారిపైనా దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో వారు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. చీకటి పడితే బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. వీటి సంతా**నోత్పత్తి నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు** చేపట్టడం లేదు. వీటి సంఖ్యను తగ్గించేలా సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక కుక్కల చెవులకు రింగ్ పెట్టాలి. అనకాపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడినా ఇక్కడ కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక వ్యాన్, సిబ్బంది లేరు. దీంతో రోజూ కుక్క కాటు బాధితులు పెరుగుతున్నారు.

పిల్లలు ఈ జాగ్రత్తలు పాటించాలి...

కుక్కలు తినేటప్పుడు, వాటి పిల్లలతో ఉన్నప్పుడు, నిద్ర పోయినప్పుడు వాటికి జోలికి వెళ్లరాదు. తోక లాగడం రాళ్లు విసరడం చేయొద్దు. కుక్కలు ఒంటరిగా వచ్చినప్పుడు కదలకుండా చెట్టులా నిలబడాలి. ఒక వేల కింద పడిపోతే రాయిలా కదలకుండా ముడుచుకుని ఉండాలి. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రమైన నీటితో కడిగి వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి. కుక్కలను ముద్దాడేటప్పుడు వీపును మాత్రమే నిమరాలి.

కుక్కల పెంపకానికి అనుమతి తప్పనిసరి..

కుక్కలను పెంచుకోవాలంటే అనుమతులు తప్పనిసరి చేసింది. ఎటువంటి అనుమతులు లేకుండా పెంచితే సంబంధిత యజమానులకు రూ.500 జరిమానా విధించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అక్కడకు **వినకుంటే రూ.250 చొప్పున జరిమానా** విధించాలని **పేర్కొంది. యాంటీ రేబిస్** వ్యాక్సిన్ **వేసుకున్నట్లు, పూర్తి ఆరోగ్యంతో** ఉన్నట్టు **ధ్రువపత్రం పొందాలని కూడా** స్పష్టం చేసింది. కానీ అవేమీ అమలవుతున్న దాఖలాలు లేవు.

> **నిర్లక్ష్యం చేయకుండా చికిత్స పొందాలి**
>
> రేబిస్ సోకిన కుక్క మనుషులను కరిస్తే వారికి అదే వ్యాధి సంక్రమిస్తుంది. ఏ కుక్క కరిచింది. ఆ కుక్క ఎలా ఉంది అనే వివరాలు డాక్టర్‌కు వివరించాలి. అప్పుడే పూర్తి స్థాయి వైద్యం అందుతుంది. ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే ప్రాణాల మీదకు వస్తుంది. గతంలో కంటే ప్రస్తుతం రేబిస్ బాధితులు పెరుగుతున్నారు. ఎక్కువగా చిన్న పిల్లలను కరుస్తున్నాయి. తొలి రోజు జీరో డోస్, మూడో రోజు, ఏడో రోజు, 28వ రోజు మొత్తం నాలుగు డోస్‌ల్లో ఏవీఆర్ ఇంజక్షన్లు ఇస్తున్నాం. యాంటీబయాటిక్ మందులు వాడకపోతే నాన్ వెజ్ తినకూడదు. వంకాయ, మునగకాడ, చీముపట్టే వస్తువులు తినరాదు. కుక్క కరిచిన వారు నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలి.
>
> – క్రిసోలైట్, ఏనిమల్ బైట్ క్లినిక్ ఇన్‌చార్జి, ఎన్టీఆర్ ఆస్పత్రి, అనకాపల్లి



కుక్క కరవడంతో గాయాల పాలైన మూడేళ్ల బాలుడు

గతేడాది నుంచి ఈ నెల వరకు నమోదైన కుక్క కాటు కేసులు		
సంవత్సరం	నెల	కేసులు
2024	ఏప్రిల్	240
	మే	462
	జూన్	256
	జూలై	239
	ఆగస్టు	250
	సెప్టెంబర్	209
	అక్టోబర్	268
	నవంబర్	266
	డిసెంబర్	276
2025	జనవరి	285
	ఫిబ్రవరి	361
	మార్చి	361
ఏప్రిల్ 14వ తేదీ వరకు అత్యధికంగా 494 కేసుల నమోదు		

ఒంటరిగా వెళ్లాలంటే భయం



పట్టణంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒంటరిగా వెళ్లాలంటే భయమేస్తోంది. ఉదయం, సాయంత్రం పిల్లలు స్కూళ్లకు వెళ్లి వచ్చినప్పుడు వారికి తోడుగా ఉండాల్సి వస్తోంది. తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి

– చౌదరీస్ మునింగా రామ్, అనకాపల్లి

పట్టణంలో తీవ్రంగా సమస్య



పట్టణంలో సమస్య తీవ్రంగానే ఉంది. అందుకు తగిన చర్యలు తీసుకుంటాం. జీవీఎంసీ మెయిన్ ఆఫీస్ నుంచి కుక్కలను పట్టుకునే వ్యాన్‌ను తీసుకువచ్చి శస్త్రచికిత్సలు చేయిస్తాం. అనకాపల్లికి ఒక యూనిట్ మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.

– రమణ, జీవీఎంసీ జోనల్ కమిషనర్, అనకాపల్లి

నూకాంబిక భక్తులకు మెరుగైన సౌకర్యాలు

- అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ విజయకృష్ణన్



నూకాంబికను దర్శించుకున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో షేక్ అయిషా

అనకాపల్లి: నూకాంబిక అమ్మవారి నెల పండుగలో భాగంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా దేవస్థానం ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని సోమవారం కలెక్టర్, ఆర్డీవో షేక్ అయిషా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మవారి నెల పండుగ పురస్కరించుకుని ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించిందన్నారు. ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతుందని, వారిని దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఆలయ ఈవో వెంపలి రాంబాబులు కలెక్టర్, ఆర్డీవోలను శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను(గొల్లబాబు), కమిటీ సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లుల శ్రద్ధతో ఆరోగ్యకరమైన పిల్లలు

- మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చిన్మయిదేవి



గర్భిణులకు అవగాహన కలిగిస్తున్న ప్రాంతీయ సహాయక సంచాలకురాలు చిన్మయిదేవి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చిన్మయిదేవి

కశింకోట: జీవిత కాలం ఆరోగ్యకరమైన పిల్లలుగా తయారు కావడానికి తల్లులు దోహదపడాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చిన్మయిదేవి తెలిపారు. స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆమె సందర్శించారు. పోషణ పక్వాడ, పక్షోత్సవాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు ఉన్న కాలాన్ని గోల్డెన్ థౌసెండ్ డేస్ (బంగారు వెయ్యి దినాలు)గా పేర్కొంటారన్నారు. ఈ కాలంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పోషకాహారం, ఇతర సేవలందిస్తే ఆరోగ్యకరమైన బిడ్డగా తయారవుతారన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు తూనిక వేయించుకొని అభివృద్ధిని పరిశీలించుకోవాలన్నారు. పోషకాహార లోపం, ఆరోగ్య సమస్య ఉత్పన్నమైతే వాటిని నివారించుకోవడానికి కృషి చేయాలన్నారు. బయట దొరికే జంక్ ఫుడ్స్ తినరాదని, దీనివల్ల ఊబకాయం వస్తుందన్నారు. ఇంట్లో వండుకుని తయారు చేసుకున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాల సదనాన్ని కూడా సందర్శించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ, కార్యకర్తలు సంతోషి, శ్యామల తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేబాకలో అన్న సమారాధన



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



రేబాకలో చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న రేబాక మధుబాబు

తుమ్మపాల: మండలంలో రేబాకలో డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు మధ్యాహ్నం నిరుపేదలకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మంత్రి సత్యనారాయణ, మార్టూరు భాస్కరరావు, మాజీ సర్పంచ్ పోలవరపు వీరాస్వామి, మామిడి చిన్నారావు, పచ్చికూర గాంధీ, కోన నాయుడు పాల్గొన్నారు. తుమ్మపాల ప్రధాన రహదారి ఇందిరాకాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తుట్టా రమణ, మండల అధ్యక్షుడు కత్తెర శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు కట్టమూరి నూకఅప్పారావు, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బి. బాలమురళి, బోయిన భానుమూర్తి యాదవ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి, మాజీ ఎంపీ సత్యవతి
- వాడవాడలా జయంతి వేడుకలు



రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ సత్యవతి



ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటి యువతరం కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కోరారు. స్థానిక రింగ్‌రోడ్డులోని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ చిత్రపటానికి మాజీ ఎంపీ బీవీ సత్యవతితో కలిసి బూడి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు పల్లేల సాయికిరణ్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి, కశింకోట మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, మలసాల కిశోర్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ సీనియర్ నాయకులు మలసాల కుమార్ రాజా, ఉగ్గిన అప్పారావు, మరిపల్లి శోభ, గొల్లవిల్లి శ్రీనివాసరావు, బొడ్డేడ లక్ష్మినరసింహం, దాడి నారాయణరావు, బుద్ద రాజు, గైపూర్ రాజు, కడిమిశెట్టి సతీష్, గుండా రమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక రైల్వే స్టేషన్ రహదారి భీమునిగుమ్మం జంక్షన్, విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ బీవీ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఏఎంసీ కాలనీ వద్ద నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

• 80వ వార్డు గవరపాలెంలో...

స్థానిక గవరపాలెం అంబేడ్కర్ నగర్‌లో 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ బీవీ సత్యవతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. నిరుపేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు మలసాల కుమార్‌రాజా, డి.వి.నర్సింగరావు, సిద్ధార్థ్, కాండ్రేగుల హైమావతి, పెంటకోట శ్రీను, మారిశెట్టి శ్రీను, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎంపీపీ గొర్లి సూరిబాబు నివాళులర్పించారు. నేటి యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఎంపీడీవో కె.వి.నరసింహం, తదితరులు పాల్గొన్నారు.



గోవిందరావు కాలనీలో పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

- పూల్‌బాగ్ రోడ్డులో ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ నివాళులర్పించారు. అనంతరం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ నాయకులు, బీఎస్పీ నేతలు తదితరులు పాల్గొన్నారు.
- రామచంద్ర థియేటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొణతాల హరనాథ్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఉడ్‌పేట అగ్నిమాక శాఖ కార్యాలయంలో ఆ శాఖ నియోజకవర్గ అధికారి పి.నాగేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.
- లక్ష్మీదేవిపేట, గవరపాలెం, తుమ్మపాల గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి పౌర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.కె.వి.నారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు.
- కొత్తూరు జంక్షన్ వద్ద డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్టమూరి మంగరాజు, ఫోరం ఫర్ సోషల్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన్నారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఆర్. శంకరరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.



కశింకోట పింఛన్‌దారుల సంక్షేమ సంఘ భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు

- స్థానిక ఉడ్‌పేటలో అంబేడ్కర్ చిత్రపటానికి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు బియ్యం, వస్త్రాలు పంపిణీ చేశారు.
- స్థానిక గాంధీనగరం ఎస్సీ, బీసీ వసతి గృహంలో జిల్లా పదో అదనపు న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి మొదటి అడిషినల్ సివిల్ న్యాయమూర్తి ఎ.రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి వివరించారు.

కశింకోట: స్థానిక సంతబయల ఎస్సీ కాలనీలో రవ్వా రమేష్ సహకారంతో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 35 మంది మహిళలు సహా యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. అంభయాంజనేయ బ్లడ్ బ్యాంక్ రక్తాన్ని సేకరించారు. సాయంత్రం అంబేడ్కర్ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. రిటైర్డు ఎంఈవో నంబా రమణ పాల్గొన్నారు. స్థానిక గోవిందరావు కాలనీ సత్యనందం భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి సీఐ అల్లు స్వామినాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లలకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. స్థానిక పింఛన్‌దారుల సంఘ భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, పోలీస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మండల పింఛన్‌దారుల సంఘం కోశాధికారి కె. కామేశ్వరరావు, రిటైర్డు ఎంఈవో నంబా రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సంతబయల దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు దేవుడు, రామాంజీ, కొండబాబు, కుమార్, ఆర్ఈసీఎస్ రిటైర్డు ఉద్యోగి జగ్గారావు పాల్గొన్నారు. స్థానిక బీసీ వసతి గృహం, బాల సదన్‌లలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివలంక సత్యనారాయణ సహకారంతో బీసీ హాస్టల్ విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, దళిత నాయకుడు దొమ్మేసి సత్యారావు పాల్గొన్నారు. ఉగ్గినపాలెంలో సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ గాలి శ్రీను, జల్లూరి అప్పారావు, కె. కృష్ణ పాల్గొన్నారు. చింతలపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కొట్టి రాము, దళిత నాయకుడు కారు అప్పారావు, మాజీ సర్పంచ్ మేడిశెట్టి వెంకటరమణ, కర్రి దుర్గినాయుడు, దళిత నాయకుడు తెరపల్లి శ్రీను చెవ్వేటి రవి, వైరాల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెం గాయత్రీ స్కూల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎంసీ సభ్యులు బి. రామ్‌కుమార్, జీవీఎన్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు. బయ్యవరంలో వ్యాస రచన పోటీలో విజేత విద్యార్థులకు సీఐ అల్లు స్వామినాయుడు బహుమతులు అందజేశారు. సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఉపాధ్యాయుడు కామాకుల సూర్యనారాయణ, దళిత నాయకులు పాల్గొన్నారు. కశింకోట పోలీసు స్టేషన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి సీఐ నివాళులర్పించారు. ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కశింకోటలో రక్తదానం చేస్తున్న మహిళ



ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కొత్తూరు జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పూల్‌బాగ్ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అసోసియేషన్ సుధాకర్



కశింకోట సంతబయల అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ ఆధ్వర్యంలో నివాళులు